# ప్రేమ కథ

విజయవాడ స్టేషన్‌లో ప్లాట్‌ఫారం రద్దీగా వుంది. మెయిల్ వచ్చి ఆగింది. బండి స్టేషన్‌లో చాలాసేపు ఆగుతుందని అందరికీ తెలుసు. అయినా ఎవరి ఆత్రుత వారిది. ఎక్కేవాళ్ళను దిగేవాళ్ళు ఎక్కనివ్వడం లేదు. దిగేవాళ్ళను ఎక్కేవాళ్ళు దిగనివ్వడం లేదు.

రైలు కదలటానికి సిద్ధంగా వుంది. భాస్కర్ ఆదరాబాదరగా వచ్చి ఫస్టుక్లాసు కంపార్టుమెంటులోకి ఎక్కాడు. అతన్ని సాగనంపటానికి వచ్చిన జవాను సామానును సర్ది, హోల్డాల్ పరిచి, సలాంకొట్టి దిగి ప్లాట్‌ఫారం మీద చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

రైలు కదిలింది. భాస్కర్ సర్దుకొని వెనక్కువాలి కూర్చుని సిగరెట్ వెలిగించాడు. యథాలాపంగా ఎదురుగా కూర్చుని వున్న జంటపై చూపులు నిలిపాడు.

యువకుడు కిటికీలోనుంచి బయటకి చూస్తున్నాడు యువతి భాస్కర్ని పరీక్షగా చూస్తూంది. ఆమెను చూస్తున్న కొద్దీ ఎక్కడో చూసినట్టు అన్పించసాగింది భాస్కరుకు.

భాస్కరు పరీక్షగా చూస్తున్నట్టు గమనించగానే ఆ యువతి గిరుక్కున తల తిప్పుకుంది. తల తిప్పుకోబోయే ముందు ఆమె కళ్ళల్లో కదలిన బెదురు భాస్కరుకు కన్పించక పోలేదు.

ఆ యువకుడు తలతిప్పి ఆ యువతితో చిన్నగా ఏదో అంటున్నాడు.

భాస్కరు బుర్రలో ఏదో తొలుస్తూ వుంది. ఏదో జ్ఞాపకం అస్పష్టంగా కదులుతూ వుంది.

అతను ఏదో మాట్లాడుతూనే వున్నాడు. ఆ యువతి మాత్రం తల తిప్పకుండానే "ఊఁ ఆఁ" అంటూవుంది.

తనను చూసి ఆ యువతి ఎందుకు అలా బెదిరి పోతుంది? తల తిప్పడానికికూడా భయపడుతుందేం? తన భ్రమకాదుగదా! పరాయి మగవాడు పరిశీలనగా చూస్తూ ఎదురుగా కూర్చుంటే ఏ యువతి ముఖ్యంగా భర్తప్రక్కన వున్నప్పుడు బెదిరిపోదు!

అంతేనా? కాని తనకు ఆమెను ఎక్కడో చూసినట్టు వుండేం?

ఉన్నట్టుండి భాస్కరు మెదడులో మరుగుపడిన స్మృతి రెక్కలు టప టప లాడించింది.

అవును! ఆమే! అదే ఎత్తు! అదేరంగు! అదేముక్కు! కింది పెదవి క్రింద పెసరబద్దంత గోధుమరంగు పుట్టుమచ్చ! ఆమే!

భాస్కరు మరోసారి ఆమె ముఖం చూడటానికి ప్రయత్నించాడు. కాని లాభంలేకపోయింది. ఆమె కిటికీలో ముఖం దూర్చి బయటికి చూస్తూ కూర్చుంది.

సందేహంలేదు. ఆమే! తనను అంత పరిశీలనగా చూసి, తను చూడగానే బెదిరిపోయి ముఖం తిప్పుకుంది.

"మీ పేరు అమలకదూ!" భాస్కరు ప్రశ్నించాడు.

ఆ యువతితోపాటు, ఆమె పక్కనవున్న యువకుడు కూడా ఒక్కసారిగా చివ్వున తిరిగి చూశాడు.

ఆమె కళ్ళల్లో, ముఖంలో భయం, గాభరా కన్పించాయి. చటుక్కున తల తిప్పుకుంది.

"కాదు! అదితి! ఏం అలా అడిగారు?" ఆమె పక్కన కూర్చునివున్న యువకుడు విస్మయంగా ప్రశ్నించాడు.

"కొంతకాలం క్రితం ఒకామెను రైలుస్టేషన్‌లోనే కలుసుకున్నాను. ఆమెపేరు అమల అని చెప్పింది. అచ్చం అవేపోలికలు..." అంటూ ఆగి ఆ యువతికేసి చూశాడు.

ఆమె కిటికీ చువ్వను గట్టిగా పట్టుకుంది.

"మనిషిని పోలిన మనుషులు వుంటూనే వుంటారు" అన్నాడు ఆ యువకుడు.

"మీ పేరు?" భాస్కర్ అడిగాడు.

"ఆనందరావు."

"ఏం చేస్తుంటారు?"

"స్టేట్ బ్యాంకులో ఏజెంటుగా పని చేస్తున్నాను." ఈ సారి కొంచెం విసుగ్గానే సమాధానం ఇచ్చాడు ఆనందరావు.

"మీ పేరు?" అడిగాడు ఆనందరావు.

"నా పేరు భాస్కర్. హైదరాబాద్‌లో పోలీసు సూపర్నెంటుగా పనిచేస్తున్నాను." అంటూ భాస్కర్ అతని కేసి చూశాడు.

ఆమె ఉలిక్కిపడటం భాస్కరు గమనించాడు.

"ఆమె మీ భార్యా?" అడగకూడదని తెలిసీ అడిగాడు భాస్కరు.

ఆనందరావు కనుబొమలు ముడి పడ్డాయి. ఓ క్షణం ఆలోచించాడు. "కాబోయే భార్యా భర్తలం!" అన్నాడు ఆనందరావు అయిష్టంగానే

భాస్కరు అదోలా నవ్వాడు.

ఆనందరావుకు వళ్ళు మండి పోయింది. సంభాషణ పొడిగించడం ఇష్టంలేక ముఖం తిప్పుకొని, రైలు ముందుకు పోతుంటే, వెన్నెల్లో వెనక్కు పరుగులు తీస్తున్న పంట పొలాలనూ, చెట్లనూ, టెలిగ్రాఫ్ స్తంభాలను చూస్తూ కూర్చున్నాడు.

భాస్కరు "అనిత" కేసి చూశాడు. ఆమె బిగుసుకు పోయి బర్తుమీద రెండు కాళ్ళూ పెట్టుకొని కూర్చుని వుంది.

భాస్కరు సిగరెట్టు దమ్ములాగి గతంలోకి జారి పోయాడు.

భాస్కరు ఐ. పి. యస్. పాసయి, ట్రైనింగు నుంచి తిరిగి వస్తూ బందరు వెళ్ళాడు. తండ్రి డ్యూటీలో జాయిన్ అయ్యే ముందు ఒకసారి అర్జెంటుగా రావలసిందని టెలిగ్రాం

ఇచ్చాడు. తీరా వెళ్ళాక పెళ్ళిచూపులకని తెలిసింది. భాస్కరు విసుక్కున్నాడు. అతను చదువుకొనే రోజుల నుంచి అందమైన అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని కలలు కనేవాడు. కట్నంబాగానే ఇస్తామన్నారు. కాని భాస్కరుకు అమ్మాయి నచ్చలేదు. వెంటనే నచ్చలేదని చెప్పకుండా హైదరాబాద్ వెళ్ళి వుత్తరం రాస్తానని తండ్రితో అని బయలుదేరాడు.

విజయవాడ స్టేషన్‌కు వచ్చేసరికి మద్రాసు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్సు మూడు గంటలు లేటని తెలిసింది.

బండి ఏ ఒంటిగంటకో గాని రాదు. ఫస్టుక్లాసు వైటింగ్ రూంలోకి వెళ్ళి రెండుకుర్చీలను చేర్చి పడక తయారు చేసే ప్రయత్నంలో వుండగా ఓ యువతి లోపలకు వచ్చింది.

ఎంతో దూరం నుంచి ఎవరో తరుముతూ వుంటే తప్పించుకొని పరిగెత్తుకొచ్చినదానిలా కన్పించింది. ఆమె కళ్ళలో బెదురు ... ముఖంలో భయం ...

"ఇది మగవాళ్ళ వైటింగ్ రూం. పక్కనే ఆడవాళ్ళ వైటింగ్ రూం వుంది" అన్నాడు భాస్కరు ఆమె ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

"అందంగా వుంది" అనుకున్నాడు మనసులోనే.

ఆమె ఓ క్షణం అతని ముఖంలోకి చూసి "ఆ సంగతి నాకూ తెలుసు. అక్కడ చాలా కిసాటుగా వుంది. ఇక్కడ నేను కూర్చుంటే మీకు ఇబ్బందా?" అన్నది.

"అవును ఇబ్బందే" అని అనాలనిపించినా సంస్కారం అడ్డొచ్చి "అబ్బే నాకేం ఇబ్బంది? పొరపాటుగా వచ్చా రేమోనని అన్నాను" అన్నాడు భాస్కరు.

భాస్కరు పక్కగా వున్న కుర్చీని ఓ మూలకు లాక్కొని ముడుచుకొని కూర్చుంది ఆ యువతి.

ఆమె కూర్చున్న తీరూ, గాబరా చూసి ఆమె దేనికో భయపడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

పోలీసుశాఖలో ట్రైనింగ్ అయి, ఆఫీసరుగా ఉద్యోగంలో చేరబోతున్న భాస్కరుకి ఆమె భయానికి కారణం తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. కాని ఎలా ఆమెను మాటల్లోకి దించాలో తెలియడం లేదు.

ప్లాట్ ఫారం మీద జనం ఎక్కువగా లేరు. భాస్కరు బయటికి వెళ్ళి ఓ పది నిముషాలు అటూ ఇటూ తిరిగి వచ్చాడు.

ఆమె అదిరిపడ్డట్టు భాస్కరు కేసి చూసింది. ఆమె తత్తర పాటును గమనించీ గమనించనట్టే కూర్చున్నాడు.

దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి గోడకేసి చూస్తూ కూర్చుంది ఆమె.

ఆమెనే చూస్తూ ఆలోచిస్తున్నాడు భాస్కరు. చూసిన కొద్దీ ఆమెలో కొత్త అందాలు కన్పిస్తున్నాయి. పాలరాతి విగ్రహంలా వుంది అనుకున్నాడు.

"ఏమండీ! ఇక్కడ మంచినీళ్ళు దొరుకుతాయా?" ఆమె భాస్కరును అడిగింది.

"ఎందుకు దొరకవూ? బయట ప్లాట్‌ఫారం నిండా పంపులున్నాయి. టీ స్టాల్ కూడా వుంది" అన్నాడు.

"ఆ సంగతి నాకూ తెలుసు."

భాస్కరుకు వళ్ళు మండిపోయింది.

"మరి తెలిసే ఎందుకు అడుగుతున్నారు?"

"బయటికి వెళ్ళడం ఇష్టంలేకే మిమ్మల్ని అడుగుతున్నాను" కొంచెం జంకుతూ అన్నది.

అప్పటికి కాని అతనికి, ఆమె తనను మంచినీళ్ళు తెచ్చి పెట్టమని అడుగుతున్నట్టు తోచలేదు.

వెంటనే లేచి బయటకు వెళ్ళాడు. పది నిముషాల్లో ఒక చేత్తో టీ గ్లాసూ, మరో చేత్తో నీళ్ళగ్లాసూ పట్టుకొని వచ్చాడు.

"అయ్యో టీ కూడా తెచ్చారెందుకండీ?" నొచ్చుకుంటూ నీళ్ళగ్లాసు అందుకుని గటగటా తాగేసింది.

"ఫర్వాలేదు. తీసుకోండి" టీ గ్లాసు అందించాడు భాస్కరు

"వద్దండీ! మీరు తాగండి." మొహమాటపడిపోతూ అన్నది సన్నగా.

"నేను తాగే వచ్చాను. తీసుకోండి."

"థాంక్స్" అన్నది గ్లాసు తీసుకొని.

అలా అన్నప్పుడు ఆమె కళ్లు మెరిశాయి. అందమైన ఆమె కనురెప్పల్నీ, సోగకళ్ళనూ, ఆ కళ్ళల్లో కదిలిపోతున్న తళుకుల్నీ చూస్తూ తన్మయత్వం చెందాడు భాస్కరు.

ఖాళీ గ్లాసులు టీ దుకాణంలో ఇచ్చి తిరిగి వెయి టింగ్ రూంలోకి వచ్చాడు.

"నెల్లూరు వెళ్లే బండి ఎన్ని గంటలకు వస్తుంది?" ఓరగా చూస్తూ ప్రశ్నించింది ఆమె.

"ఇప్పుడెక్కడబండీ, అది ఎప్పుడో వెళ్ళిపోయింది. మీకు తెల్లవారేదాకా ఇక బండి లేదు" అన్నాడు అతను.

"తెల్లవారే దాకా బండిలేదా?" గాబరాగా అడిగింది ఆమె.

"తెల్లవారు ఝామున బందరు బండి వుందిలెండి."

"అమ్మ బాబోయ్! బందరు బండా" అని వెంటనే నాలుక కరుచుకుంది.

ఆమె వాలకం చూస్తుంటే భాస్కరు బుర్రలో అనేక ప్రశ్నలు పుట్టుకొచ్చాయి పుట్టగొడుగుల్లాగ.

"ఇంకో గంటలో హాయిదరాబాద్ ఎక్స్‌ప్రెస్ వస్తుంది."

"హాయిదరాబాద్ వెళ్ళేబండి గంటలో వస్తుందా? అయితే నాకూడా ఒక టికెట్ తెచ్చిపెట్టండి." హ్యాండ్ బ్యాగ్ తెరుస్తూ అన్నది.

అతని అనుమానం నిజమైంది. తను విసిరిన వలలో చిక్కుకుంది అనుకున్నాడు.

"ముందు నెల్లూరుబండి అడిగావ్, ఇప్పుడు హాయిదరాబాద్‌కు టికెట్ తెచ్చిపెట్ట మంటమంటున్నావ్. ఏమిటీ కథ!" ఏకవచన ప్రయోగం చేశాడు భాస్కరు.

ఆమె మాట్లాడలేదు. తల వంచుకుంది.

దాంతో అతనికి ధైర్యం ఎక్కువయింది. ఆమె కుర్చీకి దగ్గరగా వెళ్ళి నిల్చున్నాడు.

"బందరు అంటే అమ్మబాబోయ్ అన్నావ్. అంటే బందరునుంచి వస్తున్నావన్న మాట." 'నీ సంగతంతా నాకు తెలిసిందిలే' అన్నట్టు వుంది అతని ధోరణి.

"ఎక్కడనుంచో ఓ చోటు నుంచి వస్తున్నాను. అసలు నా సంగతి మీకెందుకూ?" కోపంగా లేచి నిల్చుంది ఆమె.

గడపలోకి వచ్చి బయటికి తొంగి చూసి, తిరిగి లోపలికి వచ్చింది. అతనికి దూరంగా వున్న మరో కుర్చీలో కూర్చుంది.

"ఇదిగో, అమ్మాయ్! నిజం చెప్పు! ఎక్కడ నుంచి వస్తున్నావ్? లేకపోతే?" పోలీసు ఆఫీసరు దర్జాలో అన్నాడు.

"ఏమిటయ్యా నీ బెదిరింపు? ఏం చేస్తావంటా?" కోపంగా అన్నది ఆమె.

"ఏం చేస్తానా? పోలీసులకు అప్పజెపుతాను."

ఆ మాటతో ఆమె హడలి పోయింది. బిక్క మొహం వేసింది. బెరుకుగా అతని ముఖంలోకి చూసింది. దెబ్బతిన్న లేడి పిల్లలాగ.

అదే అదనుగా భావించి తన కుర్చీని ఆమెకు దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

"నువ్వు లేచిపోయి వస్తున్నావ్! అవునా!" అతను ఆమె ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ అన్నాడు.

ఆ మాటకు ఆమె ఉలిక్కి పడింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

భాస్కరుకు ఆమెను చూస్తుంటే జాలి వెయ్యలేదు.

"మొగుడి కళ్ళు కప్పి పారిపోయి వస్తున్నావుగదూ?"

"కాదు...కాదు..." గట్టిగా దాదాపు అరిచినట్టే అన్నది. అంతలోనే దుఃఖం పొర్లుకొచ్చింది. రెండుచేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది.

భాస్కరుకు ఈ సారి జాలివేసింది. అందమైన ఆడపిల్ల అలా ఏడుస్తుంటే చూడలేక పోయాడు.

"ఊరుకో! నేనేమీ అడగనులే?" అన్నాడు జాలి ఉట్టిపడే స్వరంతో.

ఆమె కళ్ళుతుడుచుకుంది. తలెత్తి భాస్కరు ముఖం లోకి చూసి "అసలు సంగతి చెప్పమంటారా?" అంది

"నీ ఇష్టం!"

"నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నారు. ఆ సంగతి తెలిస్తే మీరు అంత కఠినంగా మాట్లాడరు. నాకు అన్యాయం జరుగుతూ వుంటే తల వంచి వుండలేక పారిపోయి వచ్చాను. నా నూరేళ్ళ జీవితాన్ని అయినవాళ్ళే నాశనం చేయగడానికి సిద్ధపడ్డారు. నాకు అమ్మా, నాన్నా లేరు. మాది బందరు దగ్గిర ఓ చిన్న పల్లెటూరు. ఊరు పేరెందుకులెండి. మా మేనమామ ఇంట్లో పెరిగాను. స్కూల్ ఫైనల్ వరకు చదువుకున్నాను. మా మామ తన భార్య పోరు పడలేక నన్ను తన బావమర్దికి ఇచ్చి పెళ్ళి చెయ్యడానికి నిశ్చ

యించుకొన్నాడు. వాడు వట్టి బడుద్దాయి. పొట్టకోస్తే అక్షరం ముక్కలేదు. నల్లగా మొరటుగా తుమ్మ మొద్దులా వుంటాడు. అతనంటే నాకు అసహ్యం నేను ఎంత ఏడ్చినా, మొత్తుకున్నా లాభం లేక పోయింది. అందుకే పారిపోయి వచ్చాను.” చివరి మాటలు అంటున్నప్పుడు ఆమె కంఠం దుఃఖంతో బొంగురు పోయింది!

భాస్కరుకు బోలెడంత జాలి వేసింది.

అపరంజి బొమ్మలాపుంది. చూస్తూ చూస్తూ ఈ పిల్ల గొంతు కొయ్యడానికి ఎలా సిద్ధపడ్డాడో ఆ మేనమామ!

“ఎక్కడికి కెళతావ్? ఎవరైనా తెలిసిన వాళ్ళు వున్నారా!”

“లేరు. ఎక్కడికెళ్ళాలో నాకే తెలియదు.” కళ్ళలో నీరు తిరిగింది.

భాస్కరు ఆలోచనలో పడ్డాడు

“నీ పేరేమిటి?”

“అమల”

అమల! ఎంత బాగుంది పేరు, అందానికి తగ్గ పేరు. పాపం! ఈ పరిస్థితుల్లో వ్యక్తిత్వం గల ఏ ఆడపిల్లయినా యిలాగే చేస్తుంది.

“మరి హాయిదరాబాద్‌లో ఎక్కడికెళతావు?”

ఆ పిల్ల అయోమయంగా, దిగులుగా భాస్కరు ముఖంలోకి చూసింది.

"నాతో వస్తావా?"

"మీతోనా" బెదిరిపోతూ ప్రశ్నించింది.

"ఏం నేనంత దుర్మార్గుణ్నిగా కనిపిస్తున్నానా" నవ్వుతూ అన్నాడు భాస్కరు.

ఆ అమ్మాయి మాట్లాడలేదు.

"నన్ను పెళ్ళిచేసుకొంటావా?"

ఆ అమ్మాయి చివ్వున తలెత్తి చూసింది ఓ క్షణం.

"మీకు నన్ను చూస్తుంటే ఎగతాళిగావుందా?" చేతుల్లో ముఖం దాచుకొని మళ్ళీ వెక్కి వెక్కి ఏడవసాగింది.

"అమలా! నేను ఎగతాళి చెయ్యడం లేదు. నిజమే చెబుతున్నాను. నిన్ను చూసిన మొదటి క్షణంలోనే నా హృదయాన్ని పోగొట్టుకున్నాను. నా కలల్లోని రాజకుమారివి నువ్వే! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను" ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఆమె ఓ క్షణం నమ్మలేనట్టు భాస్కరు ముఖంలోకి చూసింది. భాస్కరు ముఖంలో ఆమెకు ఏం కన్పించిందో, మరుక్షణంలో కళ్ళు సంతోషంతో మిలమిల మెరిసిపోయాయి.

భాస్కరు కన్నీటితో తడిచిన ఆమె చెంపల్ని తుడిచాడు. హైదరాబాద్ వెళ్ళగానే రిజిష్టర్ మారేజ్ చేసుకుని తర్వాత తండ్రికి ఉత్తరం రాయడానికి నిశ్చయించుకున్నాడు.

బయటి కెళ్ళి ఆమెకు టికెట్ కొనుక్కొచ్చాడు.

పన్నెండున్నరకు బండి వచ్చింది. అమల వెయిటింగు రూములోనుంచి భయం భయంగా బయటికి వచ్చి బండి ఎక్కింది.

బండి బయలుదేరింది. ఇద్దరి ప్రాణాలు కుదుటపడ్డాయి. ఎన్నెన్నో మాట్లాడుకున్నారు. ఆ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో మరో వయసు మళ్ళిన ఆయన మాత్రం వున్నాడు.

ఆమె అర్ధగంటకే నిద్రలోకి జారిపోయింది. భాస్కరు మాత్రం ఆ అందాలరాసితో గడపబోయే తన జీవితాన్ని గురించి ఆలోచించుకుంటూ పడుకున్నాడు. తెల్లవారు ఝామున ఆలోచనల నుంచి నిద్రలోకి జారిపోయాడు.

"కాఫీ! చాయ్" అంటూ అరుపులతో భాస్కరుకు మెలకువ వచ్చింది. కళ్ళునులుపుకుంటూ లేచి కూర్చున్నాడు. తెలతెల వారుతూవుంది కాజీపేట స్టేషన్.

అమల కాఫీ తాగుతుందేమో! అనుకుంటూ ఎదురు బర్తు కేసి చూశాడు ఖాళీబర్తు అతని ముఖంలోకి బోసిగా చూసింది. భాస్కరు ఓ క్షణం అలాగే చూస్తూ వుండి పోయాడు.

"అమల ఏదీ? ఎక్కడ కెళ్ళింది? లేవేటరీకి వెళ్ళిందేమో! ఆ ఆలోచన రాగానే తన గాబరాకు తానే నవ్వుకున్నాడు అమలకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

ఐదు ... పది ... ఇరవై నిముషాలయింది. అమల రాలేదు. బండి కదిలింది. లేచి లేవేటరీ దగ్గరకు వెళ్లి చూశాడు. తలుపు తెరుచుకుంది. అందులో ఎవరూ లేరు.

భాస్కరు నీరు కారిపోయాడు. అమల ఎందుకలా చేసింది? తనమాట నమ్మలేకపోయిందా? నమ్మించి మోసం చేస్తాననుకుందా? కొన్నిగంటలు తనను మురిపించి వెళ్ళిపోయిందా? దిగులుగా వచ్చి సీట్లో కూర్చున్నాడు.

భాస్కరు కళ్ళు ఎదురుగావున్న బర్తుమీద నుంచి కిందకు వాలాయి. అక్కడ వుండాల్సిన వస్తువేదో లేనట్టు లీలగా తోచింది.

తన సూటుకేస్ఏదీ. ఏమయింది? కంపార్టుమెంటంతా వెతికాడు. ఎక్కడా లేదు.

అయితే ... అమల ... ఆ పైకి ఆలోచించలేకపోయాడు. ఎంతపని చేసింది ? పెట్టెలో దాదాపు వెయ్యి రూపాయలున్నాయ్! ముఖ్యంగా బట్టలు ...

పోలీసు ఆఫీసరుగా డ్యూటీలో జాయిన్ కాబోతున్న తను ఒక ఆడపిల్ల వలలో ఎంత అందంగా చిక్కుకున్నాడు...

గత స్మృతుల నుంచి బయటపడి ఎదురు బర్తుకేసి చూచాడు. వాళ్ళిద్దరూ ఎప్పుడు పడుకున్నారో అతను గమనించనేలేదు. ఆమె కింద బర్తుమీదా, ఆ యువకుడు పై బర్తుమీదా పడుకొని వున్నారు.

ఆమె నిశ్చింతగా నిద్రపోతూంది.

ఈమె అమలా! అమలే అయితే ఇంత హాయిగా నిద్రపోగలదా! అంతా దొంగనిద్రేమో?

భాస్కరు పక్కపర్చుకొని పడుకొన్నాడు. నిద్ర

పోకుండా ఆమె ఏం చేస్తుందో చూడాలని నిర్ణయించుకున్నాడు.

మూడు గంటలవుతుంది. నిద్ర ముంచుకొస్తుంది. కళ్ళు తెరచి ఆమెకేసి చూశాడు. ఆమె హాయిగా నిద్రపోతూ వుంది.

ఈమె అమల కాదు. మనిషిని పోలిన మనుషులుంటారు. తను పోలీసు బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు.

భాస్కరు నిద్రలోకి జారిపోయాడు.

"ఏమండీ! ఏమండీ!" ఎవరో గాబరాగా భాస్కరును కుదిపి లేపుతున్నాడు.

భాస్కరు బద్ధకంగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఆ యువకుడు కన్పించి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. తెల తెలవారుతోంది, కాజీపేట స్టేషన్.

"ఆమె ఎక్కడండీ?" గాబరాగా అడిగాడు ఆ యువకుడు.

"ఎవరూ!" నిద్రమత్తు నుంచి పూర్తిగా బయటపడకుండానే అడిగాడు భాస్కరు.

"అదే ... ఆమె ... అనిత ..."

భాస్కరు నిటారుగా కూర్చున్నాడు.

"అమల కన్పించడం లేదా !"

"అమల కాదండీ అనిత —"

"అదేలేవయ్యా ... అవ్వ పేరే ముసలమ్మ ..."

"పాపం ఏమయిందో ఏమో ? చాలా చిక్కుల్లో

వుంది. — నా మాటలు నమ్మినట్టు లేదు ... ఎలాగయినా అతను వెదకాలండీ! మీరు పోలీసు ..."

"సూకర్నే టుబా, వెతుకుతాను" తప్పకుండా వెదు తాను తనకు తనే అనుకున్నట్టు అన్నాడు భాస్కరు.

"బహుశా ఇమ్మా స్టేషన్‌లో దిగి పోయింటో ఏమో ..."

"ముందు నీ సూట్ కేస్ వుందో లేదో చూసుకో వయ్యా?"

ఆనందరావు భాస్కరు మాటలు అర్థం కానట్టు చూశాడు.

"ఏమిటలా చూస్తారు. మీ సూట్ కేస్ వుందో లేదో చూడండి"

ఆనందరావు గిరుక్కున తిరిగి సూట్ కేస్ పెట్టిన చోటుకు చూపులు సారించాడు ఆ స్థలం బోసిగా కనిపించింది. ఆత్రుతగా బెర్తు దగ్గరకెళ్ళి వంగి అంతటా వెదికాడు.

"నా సూట్ కేస్ ... లేదు ... అందులో ఆఫీసు డబ్బు పదివేలు వుంది ..." నాలుక పిడచ కట్టుకు పోతుంటే ఎలాగో అనగలిగాడు.

కాళ్ళలో సత్తువంతా ఎవరో సిరంజితో ఒక్కసారిగా లాగేసినట్టు కూర్చున్న చోటునే కుప్పకూలిపోయాడు.

"పాపం! ఇతను కూడా తనలాగే ఆ అమ్మాయిని ప్రథమ చూపులోనే ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని వాగ్దానం చేసి వుంటాడు." జాలిగా ఆనందరావు కేసి చూశాడు భాస్కరు.